నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:66 పేజీలు:4 వెల: రూ.1/-

ఇంటింటికీ బ్లీచింగ్ పౌడర్..క్లోరోక్విన్ మాత్రలు

మంత్రి కెటిఆర్ ఆదేశాల మేరకు నగరంలో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ మాత్రలను పంపిణీ చేసిన అధికారులు

మంత్రి కెటిఆర్ ఆదేశాలతో అధికారుల పంపిణీ

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో ఇటీవలి వర్షాలు,వరదలకు భారీ పైపులైన్లు లీకై వరద నీరు సంపుల్లోకి, ట్యాంకుల్లోకి చేరి నీరు అపరిశుభ్రమై అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు యుద్ధప్రాతిపదికన ఇంటింటికీ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. మంత్రి ఆదేశాలకు మేరకు జలమండలి అధికారులు వెంటనే పంపిణీ ప్రారంభించారు. జలమండలి ఉద్యోగులు కేటీఆర్ ఆదేశాలమేరకు హైదరాబాద్ లోని ఇంటింటికీ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఇంటికి ఒక కిలో బ్లీచింగ్ పౌడర్, నీటిలో కలపడానికి క్లోరిన్ మాత్రలను ఇస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాల కారణంగా ఇంటి నిల్వ సంపు.. వర్షపు నీటితో కలిసి ఉంటే, మీ సంపులు, ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రపరచాలని కూడా జలమండలి హైదరాబాద్ ప్రజలకు ఒక ప్రకటన జారీ చేసింది.

జలమండలి సరఫరా నీటితో సంపులు నింపుకుని ఆ నీటిలో క్లోరిన్ మాత్రలను కలిపి నీటిని వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇతర వివరాలకు జల మండలి కస్టమర్ కేర్ నెం. 155313 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. సంపులను, ట్యాంకులను ప్రభుత్వం సరఫరా చేసే బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం పరుచుకోవాలని, సరఫరా చేసే తాగునీటిలో క్లోరిన్ మాత్రలు కలుపుకొని వాడుకోవాలని హైదరాబాద్ జలమండలి ప్రజలకు సూచించింది. ప్రజారోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, హైదరాబాద్‌లో సాధ్యమైనంత త్వరగా పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్నిచర్యలు తీసుకుంటామని మంత్రి కేటీఆర్ తెలిపారు. నగరంలో ప్రజలు తాగునీటి విషయంలో కొన్నిరోజులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచివడపోసిన నీటిని తాగితే సీజనల్ వ్యాధులు దరిచేరవని చెప్పారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో బురద తొలగింపు

అక్రమ కట్టడాలపైనా గ్రేటర్ అధికారుల దృష్టి

హైదరాబాద్,అక్టోబర్17 (ఆర్ఎన్ఎ): వరద ప్రభావిత ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేపట్టనున్నామని, దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ వెల్లడించారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతు న్నాయని చెప్పారు. రహదారులు, నాలాల్లో చేరిన చెత్త, బురదను తొలగిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలను అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా మల్కాజిగిరిలో నాలాలపై అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నారు. పటేల్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నారు. ఆక్రమణల తొలగింపును స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యవేక్షిస్తున్నారు. నిన్న మల్కాజిగిరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈసందర్భంగా అక్రమ కట్టడాల కూల్చివేతకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

దేశంలోనే విప్లవాత్మకం ధరణి పోర్టల్

25న ప్రారంభానికి సన్నద్ధంగా ఉండాలి కలెక్టర్లతో సిఎస్ సోమేశ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ధరణి పోర్టల్ దేశంలోనే విప్లవాత్మకంగా నిలుస్తుందని సోమేశ్‌కుమార్ అన్నారు. శనివారం పోర్టల్ సన్నద్ధతపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్లతో పాటు తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్లు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ముఖ్యమంత్రి కేసీఆర్ పోర్టల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 570 మండలాల్లోని తహసీల్దార్లు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగ్రా పని చేస్తారని, సబ్ రిజిస్ట్రార్ అధికారులు 142 ప్రదేశాల నుంచి వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేస్తారని చెప్పారు. పోర్టల్ పారదర్శకంగా, భద్రతా ప్రమాణాలతో ఉంటుందని చెప్పారు. ధరణి పోర్టల్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించి, అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్లు రేపటి కల్లా కనీసం పది లావాదేవీలను ప్రయోగాత్మకంగా పూర్తి చేయాలని సూచించారు. ధరణి సేవలకు అంతరాయం కలుగకుండా చూసేందుకు డిస్కమ్, బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్ ప్రొవైడర్లు, టీఎస్‌టీఎస్ ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇందులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీ శేషాద్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి రిజ్వీ, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టియానా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతు ప్రసాద్, ÷నాన్స్ ప్రత్యేక కార్యదర్శి రోనాల్డ్ రాస్, పీఆర్ఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, టీఎస్‌టీఎస్ ఎండీ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పచెరువులో ఆక్రమణలను తొలగించండి

ఎవరినీ ఉపేక్షించాల్సిన అసవరం లేదు
మరమ్మత్తులతో రహదారులను పురుద్ధరించండి
-అప్పచెరువును పరిశీలించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): అప్పచెరువులో ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ఆదేశించారు. ఎలాంటి భేషజాలకు పోకుండా ఆక్రణలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాజేంద్రనగర్ పరిధిలోని అప్ప చెరువుకు గండి పడిన విషయం తెలిసిందే. దీంతో 44వ జాతీయ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. ఆ తర్వాత అధికారులు మరమ్మతులు చేపట్టి రహదారిని పునరుద్ధరించారు. ఈ క్రమంలో ఇవాళ 44వ జాతీయ రహదారితో పాటు అప్ప చెరువును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సాగునీటి శాఖతో సమన్వయం చేసుకుని తెగిన చెరువు కట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువులో అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగించాలని కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపైన ప్రధాన దృష్టి సారించి పని చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఎలాంటి అంటురోగాలు ప్రబలకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరదల వలన ప్రాణ నష్టం జరగడం బాధాకరం... ప్రాణ నష్టం అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించింది. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వం ప్రజలకు అవసరమైన రేషన్ కిట్లు, వైద్యం, ఇతర తక్షణ సదుపాయాలను కల్పిస్తున్నది అని కేటీఆర్ తెలిపారు.

బాధిత కుటుంబాటలకు ఆర్థికసాయం

గగన్‌పహాడ్, అలీనగర్‌లో వరదల నేపథ్యంలో చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి కేటీఆర్ చెక్కులు అందజేశారు.

నగర శివార్లలోని గగన్‌పహాడ్‌లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ శనివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులతో పాటు మృతుల కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించారు. గగన్‌పహాడ్‌లో బుధవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతు అయ్యారు. గల్లంతైన వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా, మరో వ్యక్తి మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అలీనగర్‌లో గల్లంతైన వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. అలీనగర్‌లో గల్లంతైన 8 మందిలో ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంత్రి కేటీఆర్ వెంట విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఔటర్‌పై ట్రామా కేర్ సెంటర్ ప్రారంభం

నగర పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)పై ముఖ్యమైన ఇంటర్ సెక్షన్ పాయింట్ల వద్ద 10 బేసిక్ ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇవాళ వరల్డ్ ట్రామా డే సందర్భంగా ఈ సెంటర్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీంతో 160 కిలోమీటర్ల ఓఆర్ఆర్‌పై పూర్తిస్థాయిలో మెడికల్ ఎమ్జంగ్+న్సీ అందుబాటులోకి వచ్చింది. ప్రతి 32 కిలోమీటర్ల దూరానికి ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటల పాటు అందుబాటులో ఉండనున్నాయి. ట్రామా కేర్ సెంటర్లతో పాటు అధునాతన 10 లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ట్రామా కేర్ సెంటర్లను, అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే.

అన్ని జిల్లాల్లో చేపల పెంపకం : తలసాని

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): దాదాపు అన్ని జిల్లాల్లో చేపపిల్లల పెంపకం చేపట్టామని, అన్ని చెరువులు, ప్రాజెక్టుల్లో చేపవిత్తనాలను వదిలామని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారని అన్నారు. వరుసగా ఐదోయేడు కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉచితంగా విత్తనాలను అందించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యశాఖకు కేవలం రూ.కోటి మాత్రమే బడ్జెట్ ఉండేదని, తెలంగాణ రాష్ట్రంలో రూ.100 కోట్లకు ఆ బడ్జెట్‌ను పెంచామని మంత్రి అన్నారు. తాను అన్ని జిల్లాల్లో పర్యటించి చేపల పెంపకాన్ని ప్రారంభించానని అన్నారు. మత్స్యకారులంతా సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. రాష్ట్రంలో చేప పిల్లల అభివృద్ధి, మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు.చిన్న కుంటల్లోనూ చేపపిల్లల పెంపకానికి బడ్జెట్ పెంచాలని ముఖ్యమంత్రిని కోరతామన్నారు. బీసీల సంక్షేమానికి సీఎం కట్టుబడి ఉన్నారన్నారు. 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బీసీ కమిషన్‌ను సైతం ఏర్పాటు చేశామన్నారు. గీత కార్మికులకు రూ.5 లక్షలకు పరిహారం పెంచామని, వారి సొసైటీలను బలోపేతం చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో మరింత బడ్జెట్ కేటాయిస్తామని, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రామ కేర్ సెంటర్లను ప్రారంభించిన మంత్రి కెటిఆర్. చిత్రంలో సబితా ఇంద్రా రెడ్డి తదితరులు ఉన్నారు.

నగరంలో కెటిఆర్ విస్తృత పర్యటన

వరదప్రభావిత ప్రాంతాల ప్రజలకు భరోసా సర్కార్ అండగా ఉంటుందని హామీ

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): నగరంతో పాటు శివార్లలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ విస్తృతంగా పర్యటించారు. బాధితులను కలసి వారికి భరోసా ఇచ్చారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. మరోవైపు నగరంలో పారిశుద్యకార్యక్రమాలను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. శనివారం ఉదయం నుంచే ఆయన వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవలి వర్షాలకు చెరువులు తెగి జలమయం అయిన కాలనీల్లో కేటీఆర్ పర్యటించారు. తక్షణ సహాయ చర్యలతో పాటు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి భరోసా ఇచ్చారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో రేషన్ కిట్లు అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీల పునరుద్ధరణ చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. వరద ఉధృతికి పలు ప్రాంతాల్లో రోడ్లు, డివైడర్లు, ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నా యని జీహెచ్ఎంసీ అధికారులు, తాగునీటి పైపులైన్లు కొట్టుకుపోయాయని, కొన్ని చోట్ల డ్రైనేజీ పైపులైన్లు దెబ్బతిన్నాయని వాటర్‌బోర్డు అధికారులు వివరించారు. ఇందుకు సంబంధించిన పనులు వెంటనే చేపట్టి.. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కేటీఆర్ సూచించారు. జీహెచ్ఎంసీ, విద్యుత్తు శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి, 24 గంటల్లోగా అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

భారీ వర్షాలకు మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. శనివారం బాధిత కుటుంబాలకు బండ్లగూడ తాసిల్దార్ కార్యాలయంలో హోంమంత్రి మహమూద్ అలీ ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని అన్నారు. వరదలో ఇండ్లు కోల్పోయిన వారికి పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎవ్వరూ ఆందోళనకు గురి కావొద్దని, ఏ సమస్య లున్నా అధికారులకు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, పలువురు టీఆర్ఎస్ ముఖ్యనాయకులు ఉన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ వరద ముంపు బాధితుల పట్ల మానవత్వం చాటుకున్నారు. తన సొంత డబ్బులతో సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధ నగర్ డివిజన్‌లో ముంపు బాధితులకు 40 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. చంద్రబాబు నగర్ ఏరియాలో 1000 కుటుంబాలకు నిత్యవసరాలు అందజేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 277 మంది లబ్దిదారులకు రూ. 2.60 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పద్మారావు గౌడ్ అందజేశారు.

నగరంలోని బండ్లగూడ తహసిల్దార్ కార్యాలయంలో వరదబాధి కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేసిన హోంమత్రి మమ్మూద్ అలీ. చిత్రంలో ఎంపి అసదుద్దీన్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఉన్నారు.

వరద ప్రభావిత కాలనీల్లో ఆరోగ్యంపై సమీక్షించాల్సిందిగా కేటీఆర్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 17: వరద ప్రభావిత కాలనీల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా ఆరోగ్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఉన్నతాధికారులతో మంత్రి నేడు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటువంటి వరద సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిందిగా కోరారు. వరదల వల్ల కూలిన ఇండ్ల గణనను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే అవసరం ఉంటుందో అక్కడ అదనపు పరికరాలను, యంత్రాలను, సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకోవాల్సిందిగా సూచించారు. సమావేశం సందర్భంగా మంత్రి వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన రేషన్ కిట్లు, దుప్పట్ల పంపిణీని సమీక్షించారు. ఈ భేటీలో మేయర్ బొంతు రామ్మోహన్, పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ స్వేతా మహంతి, ఈవీడీఎం డైరెక్టర్ విశ్వజిత్ కంపతి, రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డీఆర్‌జీఎస్ రావు, అగ్నిమాపక అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ విభాగ అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. టీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు గంజి ఆంజనేయులు, గంజి భాస్కర్, గంజి రంజిత్, బాలకృష్ణతో పాటు 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాచాన్‌పల్లి తండా సర్పంచ్ శ్రీను నాయక్, ఉపసర్పంచ్ మోతీలాల్‌తో పాటు వార్డు మెంబర్లు, కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. వీరందరికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై.. టీఆర్ఎస్ పార్టీలో ఇతర పార్టీల నేతలు చేరుతున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

చరిత్రలో నేటినిజం

కం॥ చందురుని గ చల్లదనము
సందరికిని బంచెడి వరమాత్మీయుండై
వందనముల నందు కొనును
మందాగా 'క్రికెటు' నాడ "హాయసలఅర్జున్"!!

(అక్టోబర్ 18 క్రికెటర్ హెయసైల అర్జున్ జననం..) -రాధశ్రీ

సెల్: 9494481210

దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వం సిద్ధమేనా?

నేటినిజం
ఆదివారం 18-10-2020

హైదరాబాద్ విశ్వనగరంగా తయారు కావాలంటే పట్టణీకరణ కాదని తేలిపోయింది. నగరం వరదల నుంచి సేఫ్‌గా ఎలా ఉంటుందో ఆలోచన చేయాలి. మురికి కూపాలు లేకుండా చూడాలి. ఆధునిక డిజైన్లతో ఇప్పుడున్న నగరాన్ని సుందరీకరించుకోవాలి. అందుకు తగ్గట్లుగా మూసీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించుకున్న పేదలకు శాశ్వత నివాస స్థలాలను మరోచోట కల్పించాలి. ఆక్రమణలను తొలగిచాలి. చెరువులు, కుంటనలు ఆక్రమించుకున్న వారిని గుర్తించాలి. ఇప్పుడు వచ్చిన వరదల వల్ల ప్రభుత్వం పాఠం నేర్చుకుని దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. అందుకు కఠిన చర్యలు తప్పనిసరని గుర్తించాలి. గతంలో హైటెక్ సిటీ నిర్మాణం పేరుతో ప్రారంభమైన రియల్ బిజినెస్ కారణంగా అడ్డూ అదుపు లేకుండా, ప్రణాళిక లేకుండా పట్టణీకరణ పెరిగింది. హైటెక్ సిటీ కట్టేముందు రోడ్లు, డ్రైనేజీ వంటి విషయాల్లో నాటి సిఎం చంద్రబాబు నిర్లక్ష్యం కాణంగా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు కట్టుకునే దుస్థితి ఏర్పడింది. హైటెక్ సిటీని, సైబరాబాద్‌ను నిర్మించానని గొప్పలు చెబుతున్న చంద్రబాబు నగరాన్ని అడ్డదిడ్డంగా తయారు చేశారు. ఓ పద్ధతి ప్రకారం ఆనాడే నగర నిర్మాణం చేపట్టి ఉంటే ఇవాళ హైటెక్ సిటీ ప్రాంతం ఇంత దారుణంగా ఉండేది కాదు. అలాగే మురికివాడలను నిర్మూలించే కార్యక్రమాలు కూడా చేపట్టకపోవడం దారుణం. దీంతో మూసీ ఉప్పొంగడంతో ఇప్పుడు వారే బలయ్యారు. వారికి సకాలంలో గృహవసతి కల్పించి ఉంటే..డబుల్ ఇళ్లు నిర్మించి ఉంటే ఇవాళ విపత్తు ఇంత దారుణంగా ఉండేది కాదు. మహానగరం చిరకాలం మనుగడ సాగించి, స్థిరంగా ఉండాలంటే ఇక్కడి జల వనరులను రక్షించుకోవాలి. గండిపేటను ఎందుకు ఎండబెడు తున్నరో..111 జీవోకు తూట్లు ఎందుకు పొడుస్తున్నరో ప్రజలు తెలుసుకోవాలి. మూసీ నది విషయంలో ఇది ఇంకా ఎక్కువగా ఉంది. మూసీపై అక్కరకు రాని ప్రణాళికలను పక్కన పెట్టి ఆక్రమణలను తొలగించి పేదలకు నివాసయోగ్యమైన, తగినంత గృహనిర్మాణం, మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకాన్ని పూర్తి నిబద్ధతతో అమలు చేయాలి. మూసీనది హైదరాబాద్ నుంచి పరీవాహక ప్రాంతాల్లో ఉన్న అనేక గ్రామాలకు చెంరుతుంది. ఈ నదిపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ఆనకట్టల నుంచి ఈ నదిలో చేరేది చాలా తక్కువ నీళ్లే. ఈ నది హైదరాబాద్‌లోకి ప్రవేశించాక దాని విస్తీర్ణం, నీటి పరిమాణం పెరుగుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో దాని రూపం మారింది. నగరం వదిలిన వ్యర్థ జలాలతో ప్రవహిస్తున్నదే మూసీ నది. రసాయనిక వ్యర్థ జలాలు కలవడంతో ఈ జలాలు కలుషితంగా మారుతు న్నాయి. ఫలితంగా ఈ నీళ్లు వ్యవసాయానికి పనికి రాకపోవడంతో దిగువ ఉన్న రైతులు చాలా మంది సాగును వదిలశారు. ఈ నీళ్లతో పండించిన పంటలూ విషతుల్యంగా మారుతున్నాయి. హైదరాబాద్‌ను విశ్వనరమని మళ్లీ గుర్తించేలా.. నివాస యోగ్యమైన నగరంగా మార్చాలంటే మన ఆలోచనలు మారాలి. మన నిబద్ధత పెరగాలి. చిత్తశుద్ధితో పనిచేయాలి. పటిష్టమైన ప్రణాళికను ముందుకు తీసుకుని రావాలి. నగరంలోని మురికివాడలు, ఇతర ప్రదేశాల్లో నివసిస్తున్న పేదలకు గూడు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి. జీవనోపాధి కోసం నగరంలో ప్రవేశించిన వారంతా ఈ నగర పునర్నిర్మాణంలో ఉన్నారు. వారికెంత ఈ ప్రాంతం అవసరమో.. నగరానికి వారి అవసరం అంతే ఉందని గుర్తించి ముందుకు సాగాలి. గత యాభై ఏండ్లలో నగర అభివృద్ధి ప్రణాళికారహితంగా మారింది. ఇదే ఇప్పుడు వరదలకు దారి తీసింది. మూసీని ప్రభుత్వమే ఆక్రమించి. నిర్మాణాలకు అనుమతిని ఇచ్చింది. వరదలు, విపత్తులు వచ్చిన ప్రతిసారీ నదీ తీరం వెంబడి నివసించే పేదలే కారణమని ఆరోపించడం సర్వసాధారణం అయిపోయింది. కానీ మూసీ ప్రస్తుత పరిస్థితికి నదిని ఆక్రమించిన ప్రభుత్వం, బడా బిల్డర్లు, పరిశ్రమల యజమానులే కారణం. వరదలు వచ్చినప్పుడు మాత్రం మురికివాడల పేదలే బాధితులవుతున్నారు. వారు ఇండ్లే కాదు జీవనోపాధి కోల్పోయారు. మూసీ తీరం వెంట మురికివాడల్లో నివసించే పేదలను రక్షించడం, వారికి సురక్షిత ప్రాంతాల్లో పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. అభివృద్ధి, ఆధునీకరణ పేరిట నగరంలో, చుట్టు పక్కల ఉన్న జల వనరులన్నీ కబ్జాకు గురయ్యాయి. ఈ కబ్జాల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. అసలు ప్రభుత్వమే జల వనరుల అతిపెద్ద ఆక్రమణదారుగా మారింది. ఫలితంగా హుస్సేన్ సాగర్ దాని అసలు విస్తీర్ణంలో మూడింట ఒక వంతుకు తగ్గిపోయింది. మిగతా విస్తీర్ణంలో పార్కులు, రోడ్లు, ప్రైవేట్ ఆస్తులు వెలిశాయి. అలాగే ఇమ్లిబన్ బస్టాండ్, మెట్రో రైల్వే స్టేషన్, ఇతర నిర్మాణాల కోసం మూసీ నదిని ఆక్రమించారు. ఇతర చెరువులు, కుంటలు, కాల్వలు, నీటి వనరుల పరిస్థితి ఇలాగే ఉంది. జల వనరులు, నాలాలు, నదీ తీరం వెంట ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆక్రమణల తొలగింపు నకు వెంటనే నడుం బిగించాలి. చెరువులు, కుంటలు, వరద కాల్వలు, మురుగు నీటి కాల్వల పరిరక్షణకు కఠినచర్యలకు ఉపక్రమించాలి. పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వం విపత్తు ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. మురికివాడల ప్రజలు, పేదలు నివాసముండేందుకు నగరంలో భూములు, వనరులు కేటాయించాలి. ఇది చేయడానికి ప్రభుత్వానికి నిబద్ధత, చిత్తశుద్ధి అవసరం. కఠినంగా వ్యయహరించి నిర్ణయాలు తీసుకుంటే రానున్న రోజుల్లో హైదరాబాద్ అద్భుతంగా తయారు కాగలదు. లేకుంటే మళ్లీ వరదలప్పుడు ఇదే దుస్థితిని చూడాల్సి ఉంటుంది. వరదలు మళ్లీ రాకుండా ఉండేందుకు అప్పటి నిజాం ప్రభుత్వం ప్రసిద్ధ అనుసరించిన విధానాలు అమలు కావాలి.

దుబ్బాక ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు

-కాంగ్రెస్,బిజెపిలను కాదు: బోడకుంటి

హైదరాబాద్,అక్టోబర్17ఆర్ఎన్ఎ):టీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో కేవలం ఆరేళ్లలో యాభై ఏండ్ల అభివృద్ధి పనులను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించామని మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. దుబ్బాక ఉప ఎన్నికలో టిఆర్ఎస్ ఘన విజయం ఖాయమని అన్నారు. కాంగ్రెస్,బిజెపిలను ప్రజలు నమ్ముస్థితి లేదన్నారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుని పోతోందన్నారు. నియోజకవర్గ ప్రజలే ఊపిరిగా, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం నియోజకవర్గానికి పాలకునిగా కాకుండా సేవకుడిగా దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి పనిచేసారని అన్నారు. ఆయన తలపెట్టిన పనులు పూర్తి కావాలంటే సుజాత గెలుపు అనివార్యమని అన్నారు. కెసిఆర్ పట్టుదలతో తెలంగాణ సస్యశ్యామలం అవుతోందని అందుకే ప్రజలు ఆశీర్వదించి వరుసగా రెండోసారి టిఆర్ఎస్‌ను గెలిపించారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమష్టి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పరచి రాష్ట్రస్థాయిలో ఓ గుర్తింపు సాధించమాన్నారు. సీఎం కేసీఆర్ ఎల్లవేళాల ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ఓ గొప్ప నాయకుడని, ఆయన టీమ్‌లో పనిచేయడం తన అదృష్టమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక నే ప్రతిపక్ష పార్టీలు పనిగట్టుకుని ప్రభుత్వం పై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు ఎవరు ఏమి చేశారో అని స్పష్టంగా తెలుసని, ఉపఎన్నికల్లో కూడా మళ్లీ తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. దుబ్బాకలో తిరిగి టిఆర్ఎస్ ఎమ్మెల్యే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దుబ్బాకలో అభివృద్ధి కళ్లకు కనపడుతోందన్నారు.

వైద్య శాస్త్రంలో అనస్తీషియా ప్రాముఖ్యం

న్యూఢిల్లీ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): మొన్న అసాధ్యం.. నిన్న కల.. నేడు ఆవిష్కరణ.. వైద్య శాస్త్రంలో ఎన్నో అద్భుతాలు. దేవుడు ప్రాణం పోస్తే.. ఆ ప్రాణానికి ముప్పు వస్తే కాపాడేది వైద్యుడే. తీవ్రతను బట్టి మందులు.. శస్త్రచికిత్సలతో పునర్జన్మను ఇస్తున్నారు. మానవ శరీరంలో అవయవాలు పాడైతే కృత్రిమమైనవి అమర్చి ప్రాణాలు నిలుపుతున్నారు. వైద్యుల్లో గుండెలు తీసిన బంట్లు ఉన్నారు. రికార్డు స్థాయిలో ఆపరేషన్లు చేసి చరిత్రకెక్కిన వారు ఉన్నారు. ఇలా ఎంతో మంది వైద్యులు ఉన్నా శస్త్రచికిత్సలో మత్తు మందు డాక్టర్ల పాత్ర ఎంతో కీలకం. రోగికి నొప్పి, బాధ తెలియకుండా గమ్మత్తుగా ఆపరేషన్లు చేయడం వైద్యశాస్త్రంలో ఓ అద్భుతమే. ప్రతి సంవత్సరం అక్టోబర్ 16వ తేదీన ప్రపంచ అనెస్తీషియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు.. పూర్వం శాస్త్రీయ మత్తు విధానాలు అనుసరించకుండా అశాస్త్రీయ పద్ధతుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించేవారు. అందువల్ల తక్కువ శాతం శస్త్రచికిత్సలు విజయవంతం అయ్యేవి. ఒకవేళ విజయవంతం అయినా ఆపరేషన్ తర్వాత రోగి కోలుకోవడంలో సమస్యలు ఉత్పన్నం అయ్యేవి. ఈ పరిస్థితుల్లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన డబ్ల్యూటీజీ మోర్టాన్ అనే వైద్యులు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు. ఆ తర్వాత రోగి మెడపై ఉన్న కణితిని ఏ మాత్రం నొప్పి, బాధతెలియకుండా డాక్టర్ హెర్బెర్ట్ అనే సర్జన్ విజయవంతంగా తొలగించారు. ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్యవిభాగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ఆ తర్వాత పలు రకాలైన మత్తు ఔషధాలు, పరికరాలు ఆవిష్కరించడం ద్వారా పలు రకాలైన నూతన శాస్త్రీయ మత్తు విధానాలు అవలంభించడం ద్వారా వైద్య శాస్త్రంలో మత్తు విభాగం ప్రాముఖ్యత విస్తరించి, కీలకమైన విభాగంగా ఆవిష్కరించింది.

పర్యాటక రంగాన్ని ఆదుకోండి

-కేంద్రమంత్రిని కోరిన శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్ర పర్యాటక రంగాన్ని ఆదుకోవాల్సిందిగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ కేంద్రాన్ని కోరారు. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పాటిల్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కరోనా మహమ్మారి వల్ల రాష్ట్రంలో పర్యాటకరంగం కుదేలయ్యిందన్నారు. కేంద్రం తగిన ఆర్థిక ప్యాకేజీని అందించి ఆదుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు దేశంలోనే అతిపెద్ద ఎకో అర్బన్ టూరిజం పార్క్‌గా మహబూబ్‌నగర్‌లో ఉన్న మయూరి పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. టెంపుల్ టూరిజంలో భాగంగా యాదాద్రి, మన్యంకొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ప్రముఖ పర్యాటక కేంద్రం దుర్గం చెరువుపై దేశంలోనే అతిపెద్ద కాంక్రీట్ సస్పెన్షన్ బ్రిడ్జిని నిర్మించినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆరేళ్ల పాలనలో నగరంపై చిత్తశుద్ధి ఏదీ

గతపాలకులను తిట్టడానికే సరిపోతే ఎలా

నగరంలో వరదలపై విజయశాంతి ఆవేదన

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): జంటనగరాల్లో నెలకొన్న పరిస్థితులపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ కురిసిన భారీ వర్షాలు ప్రజల్ని గతంలో ఎప్పుడూ లేనంత నిస్సహాయ పరిస్థితుల్లోకి నెట్టివేయడం కళ్ళారా చూశామని అన్నారు. వరదనీరు కాలువల్లా పారని వీధి లేదు... ఏరులై ప్రవహించని రోడ్డు లేదని వాపోయారు. సోషల్ మీడియా వేదికగా ఆమె ఏమన్నారంటే.. 'దశాబ్దాల కాలంగా నెలకొన్న ఈ దౌర్భాగ్య పరిస్థితికి గత ప్రభుత్వాలే కారణమని సీఎం కేసీఆర్ దొర గారు ఎన్నోమార్లు నిందించారు. ప్రకృతిని నియంత్రించడం మన వల్ల కాదు కానీ.. చినుకు పడితే చాలు చెదిరిపోయే జంటనగర ప్రజలను వరద కష్టాల నుంచి రక్షించేందుకు గడచిన మీ ఆరేళ్ళ పరిపాలనా కాలంలో ఏ కాస్తయినా చిత్తశుద్ధితో సేవ చేసి ఉంటే... ఇంత నష్టం జరిగేది కాదు. తక్కువ ఇబ్బందులతో ప్రజలు గట్టెక్కేవారు. వానలు తగ్గినా రోజుల తరబడి కాలనీలకు కాలనీలు నీళ్ళల్లోనే నానే పని ఉండేది కాదు. కరెంట్ కోతలు చాలావరకు తగ్గి ఉండేవి. పాలనా పగ్గాలు అందుకున్న మొదటి, మలి విడతల పరిపాలనా కాలంలో ఈ పరిస్థితుల నుంచి పౌరులను రక్షించేందుకు ఏ పరిష్కారాలు చూపించారో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి చాలు. టీఆర్ఎస్ అధికారంలోకి రాకముందే ఎన్నెన్నో చెరువుల దురాక్రమణ, భూముల కబ్జాలు... అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్నాయని కేసీఆర్ పదే పదే అన్నారు. కానీ, జరిగిందేమిటి? మీరైనా ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వెయ్యగలిగారా? మీ నిర్వహణ ఏ తీరున ఉందో జలగండంలో చిక్కుకున్న మీ కలల విశ్వనగరాన్ని చూస్తే చాలు' అంటూ హైదరాబాద్ నగర్ దుస్థితిపై విమర్శల జల్లు కురిపించారు.

జలాశయాలకు నీటి కళ

తీరనున్న గ్రేటర్ మంచినీటి కష్టాలు

హైదరాబాద్,అక్టోబర్17ఆర్ఎన్ఎ): ఇటీవలి వర్షాలకు కృష్ణా,గోదావరిల్లో భారీగా నీరు చేరడంతో వచ్చేరెండేళ్ల వరకు జంటనగారాలు, శివారు ప్రాంతాలకు మంచినీటి సమస్య ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరడంతో వచ్చే రెండేళ్ల పాటు తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని అధికారులు భావిస్తున్నారు. నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, మంజీరా, జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టులనుంచి నిత్యం 600 ఎంజీడీలకు పైనే నీటిని తెచ్చుకునే వెసులుబాటు ఏర్పడింది. దీంతో నగర అవసరాలతోపాటు శివార్లకూ పుష్కలంగా నీళ్లు సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తిగా జలాలు రావడంతో రోజుకు 172 ఎంజీడీలు తరలించడానికి వీలుంది. ఈ నేపథ్యంలో శివార్ల ప్రజల నీటి సమస్య తీరినట్లేనని భావిస్తున్నారు. నీటినిల్వలతో ప్రధానంగా ఐటి జోన్‌తో పాటు శివారు ప్రాంత ప్రజల తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి. వచ్చే వేసవి నుంచి వారికి సమృద్ధిగా నీటిని అందించాలని జలమండలి నిర్ణయించింది. ఇందుకోసం 12 మున్సిపల్ సర్కిళ్లలో 58 రిజర్వాయర్ల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కొత్తగా తాగునీటి పైపులైన్ విస్తరణ చేపడుతున్నారు. ఈ పనులన్నీ కొలిక్కి రానున్నాయని తెలుస్తోంది. మార్చి లేదా ఏప్రిల్ నుంచి శివారు మున్సిపల్ సర్కిళ్లకు రోజూ లేదంటే రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రధాన నగరంలో మాత్రమే రోజు విడిచి రోజు నీళ్లు అందుతున్నాయి. శివారు ప్రాంతాల్లో చాలా నల్లాలకు 3-5 రోజులకొకసారి సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితిని అనువుగా మలుచుకొని ప్రైవేటు ట్యాంకర్ల మాఫియా కోట్ల నీటి వ్యాపారం సాగిస్తోంది. శివారు మున్సిపల్ సర్కిళ్లను గ్రేటర్‌లో కలపక ముందు ఇక్కడ తాగునీటి సరఫరాను ఆయా మున్సిపాలిటీలు చూసేవి. గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపిన తర్వాత జలమండలి పరిధిలోకి వీటిని చేర్చారు. పూర్తిస్థాయిలో రిజర్వాయర్లు, పైపులైన్ వ్యవస్థ లేకపోవడం వల్ల నీటి కష్టాలు షరామామూలుగా మారాయి. ఈ దుస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం రూ.1900 కోట్లతో తాగునీటి సరఫరా వ్యవస్థ విస్తరణకు పనులు చేపట్టింది. అనుకున్న సమయం కంటే ముందే ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశాలు ఉన్నందున ఇక మంచినీటి సరఫరాకు ఢోకా ఉండదని భావిస్తున్నారు.

నిండుకుండల్లా ప్రధాన జలాశయాలు

ప్రాజెక్టులకు పెరిగిన పర్యాటకుల రాక

హైదరాబాద్,అక్టోబర్17ఆర్ఎన్ఎ): ఇటీవలి వర్షాలకు ఆయా జిల్లాల్లో పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రజలు ఆయా ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఇంతకాలం లాక్‌డౌన్‌తో ఇంటికే పరిమితంఅయిన ప్రజలు ఇప్పుడు కాస్తంత సేదదీరాలని కోరుకుంటున్నారు. తాజా వర్షాలతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులన్నీ నిండాయి. ఇంకా వరదల జోరు తగ్గలేదు. కృష్ణా పరివాహక ప్రాంతాలు వరదలతో పోటెత్తుతన్నాయి. జూరాల, శ్రీశైలం, సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్,మంజీరా, నిజాం సాగర్ తదితర ప్రాజెక్టులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. ప్రజలు ఈ అందాలను తిలకించేందుకు ఇక్కడికి వస్తున్నారు. వీరి రాకను గమనించి ప్రాజెక్టుల వద్ద పోలీస్ బందోబస్తు పెంచారు. ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని కడెం జలాశయం పర్యాటక శోభ సంతరించుకుంది. నిండుకుండలా కళకళలాడుతున్న జలాశయం సందర్శకులను ఆకట్టుకుంటోంది. నిర్మల్-మంచిర్యాల రహదారిపైనుంచి వెళ్లే వారిని సైతం వరద గేట్ల నుంచి జాలువారు తున్న నీరు కనువిందు చేస్తోంది. కడెం అందాలను తిలకించేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. పర్యటకశాఖ వారు బోటింగు ఏర్పాటు కారణంగా పర్యటకులను పడవల్లో విహరింప జేశారు. ఇకపోతే కుంటాల తదితర జలపాతాలకుకూడా ప్రజల రాక పెరిగింది. మంచిర్యాల మండలం గుడిపేట సమీపంలోని శ్రీపాదసాగర్ (ఎల్లంపల్లి) జలాశయంలోకి వరద నీటి ఉధృతి కొంత పెరిగింది. జలాశయంలో వరద ఉధృతి పెరుగుతుండటంతో పర్యాటకులు వస్తున్నారు. పూర్వపు వరంగల్ జిల్లా ఏటూరునాగారం పరిధిలోని అభయారణ్యం ప్రపంచవాప్తంగా పర్యటకులను ఆకర్షిస్తోంది. రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, మేడారం వనదేవతల జాతర, దామెరవాయి రాకాసి గుహలు, బొగత జలపాతం, తాడ్వాయి వన కుటీరాలు, మల్లూరు లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం పర్యటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని అడవులను సంరంక్షించినట్లయితే వాటితో పాటు వన్య ప్రాణుల సంఖ్య కూడా పెరుగుతుందని అంటున్నారు. అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని అటవీశాఖ అధికారులు చెప్పారు. వన్యప్రాణులను అక్రమంగా ఎవరు కూడా వేటాడద్దని, వాటిని రక్షించుకుంటేనే ప్రకృతి సమతుల్యత సాధ్యమని వివరించారు. ప్రతి వ్యక్తి పుట్టినరోజున ఒక మొక్కను నాటడం అలవాటుగా చేసుకోవాలని, ఆటవిడుపుగా నెలకోసారయినా అడవుల్లో పర్యటించాలని అధికారులు సూచించారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అన్నారు. అక్కడక్కడా జోరుగా వర్షాలు కురుస్తున్న కారణంగగా ప్రధాన జలాశయాలకు నీరు భారీగా చేరింది. ఇందులో శ్రీశైలం, జూరాల, శ్రీరాం సాగర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఎగువన కర్నాకట నుంచి వరదనీరు రావడంతో శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వరద కొనసాగుతోంది. ఇకపోతే నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి నీటి రాక పెరిగింది. కాలువలకు నీటివిడుదల కొనసాగుతుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

ప్రజలకు అక్కరకు రాని ముఖ్యమంత్రి ఎందుకు?

కష్టాల్లో కనిపించకుండా ఫామ్‌హౌజ్‌కే పరిమితమా

వరదప్రాంతాల్లో పర్యటించిన బండి సంజయ్

సిఎం కెసిఆర్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపాటు

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ప్రజలు కష్టాల్లో ఉన్నా పట్టించుకోని సిఎం కెసిఆర్ మనకెందుకనీసిఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ ఉపద్రవం వచ్చినా బయటకు రాని వ్యక్తి సిఎంగా ఉండడం మన దురదృష్టమన్నారు. కొండగట్టు ప్రమాదం జరగినా, ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా, నగర ప్రజలు నీట మునిగినా పట్టించుకోని సిఎం కెసిఆర్ అన్నారు. ఏ మా÷-తరం స్పందన లేని ఏకైక వ్యక్తి కెసిఆర్ అన్నారు.

ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి.. ప్రజల్లో తిరగాలని డిమాండ్ చేశారు. బూట్ పాలిష్ గ్యాంగ్‌ను పంపకుండా.. సీఎం స్వయంగా కాలనీల్లో పర్యటించాలన్నారు. లేకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. శుక్రవారం ఆయన దిల్‌సుఖ్ నగర్, గడ్డి అన్నారం, బైరామల్ గూడ, బంజారా కాలనీ తదితర ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఆయన.. అక్కడి ప్రజల అవస్థలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరేళ్లలో చెరువులు, నాలాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. దీనికి టీఆర్ఎన్ బాధ్యత వహించాల్సిందేనన్నారు. 67వేల కోట్లు ఖర్చు చేశామన్నారని.. అవి ఏమయ్యాయో తెలపాలన్నారు. కాలనీలన్నీ మూసీ నదిలా మారాయని, కార్లన్నీ మునిగిపోయాయని అన్నారు. రేపటి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎన్ కారు మునుగుతుందని హెచ్చరించారు. కేంద్రం సాయం చేయడానికి సిద్ధంగా ఉందని, ఐదువేల కోట్లు అడుగుతున్న కేసీఆర్.. జిహెచ్ఎంసికి ఐదుకోట్లు విడుద చేయడం దారుణమన్నారు. కోవిడ్ నిధులు దారి మళ్లించారని ఫైర్ అయ్యారు. అన్నీ కేంద్రం ఇస్తే... సీఎం ఎందుకున్నారని, ఎవరికోసం ఉన్నారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. ఉత్తగా ఇస్తున్నారా అంటూ కేంద్రంపై విరుచుకువడే కేసీఆర్... రాష్ట్ర ప్రభుత్వమేమైనా ప్రజలకు ఉత్తగా ఇస్తుందా అని ఘాటుగా ప్రశ్నించారు. ముంపు ప్రాంతాల్లోని వారికి తిండి, నీళ్లు, కరెంట్ లేవని, వస్తువులన్నీ నానిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్ రావు, రంగారెడ్డి జిల్లా(అర్బన్) అధ్యక్షులు సామ రంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ వంగా మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేశ్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొర్లపల్లి స్వామి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు యశ్వల్ గౌడ్, బీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అంబాల మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

-బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలి: సిపిఐ

ఆదిలాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సిపిఐ నేత ముదుపు ప్రభాకర్ రెడ్డి కోరారు. అరకొర పరిహారం అందించి చేతులు దులుపుకునే పద్ధతి అవలంబించ వద్దన్నారు. పంట నష్టపోయిన బాధిత రైతులకు ధీమా కల్పించాలన్నారు. ప్రకృతి ఆగ్రహానికి రైతులు బలి అవుతున్నారన్నారు. భారీ వర్షాలు జలశయాలను నిండినా చేతికందే పంటలను దెబ్బతీశాయన్నారు.

వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంట పెట్టుబడికి సరిపోయే విధంగా పరిహారం అందిస్తే కుదరదన్నారు. మొక్కబడిగా కాకుండా ఆదుకునే విధంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. అధికారులు ప్రతి బాధితుడిని గుర్తించి జాబితాలో చేర్చాలన్నా రు. మూడెకరాల భూపంపిణీ పేరుతో 3 లక్షల దళిత కుటుంబాలకు మూడెకరాల చొప్పున భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్, కేవలం మూడు వేల కుటుంబాలకు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఉన్న భూముల్లో హరితహారం పేరుతో మొక్కలు నాటుతున్నారన్నారు. హరితహారం కాస్తా దళితులకు ఉరితాడుగా మారిందని చెప్పారు. పోడు భూములను ప్రభుత్వం లాక్కొంటున్నదని, ఈ అంశంలో గిరిజనులకు తాము అండగా నిలబడ తామని తెలిపారు. సీమాంధ్రుల కంటే అన్యాయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరిస్తున్నారని సీపీఐ నేత తెలిపారు. బ్యాంకుల్లో రైతుల రుణాలు పూర్తిగా మాఫీ కాని కారణంగా తిరిగి వారికి రుణాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో రైతులకు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్దకే వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని తెలిపారు. రైతులను పట్టించుకోని ఈ సర్కారు హరితహారం పేరుతో హం

గోదావరిలో యువకుడు గల్లంతు

-గాలింపు చేపట్టిన గజ ఈతగాళ్లు

నిజామాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సమీపంలో గోదావరి నదిలో యువకుడు గల్లంతయ్యాడు. జక్రాన్ పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన సబ్బని నగేశ్ (28) మిత్రులతో కలిసి శనివారం ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చాడు. ప్రాజెక్టు సమీపంలోని పోచంపాడ్ పుష్కర ఘాట్ వద్ద సరదాగా ఈత కొట్టేందుకు నగేశ్ స్నేహితుడు గంగాధర్‌తో కలిసి నీటిలోకి దిగాడు. నదిలో ప్రవాహం ఉధృతి అధికంగా ఉండటంతో అలసటకు గురైన నగేశ్ గల్లంతయ్యాడు. స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసుల సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపడుతున్నారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీరాం విజయ్‌కుమార్, ఎస్ఐ సురేశ్, తాసిల్దార్ జనార్దన్ పరిశీలించారు. నగశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ధరణి నమోదుకు తాత్కాలిక బ్రేక్?

-వర్షాలు,వరదలతో ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): ధరణి ఆస్తుల నమోదుపై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి ఆస్తుల నమోదును ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. వర్షాల కారణంగా తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు.. ఆస్తుల నమోదు చేపట్టొద్దని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దసరా నుంచి ధరణి పోర్టల్ ప్రారంభం కానుండటంతో ప్రభుత్వం అధికారులను సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా ధరణి పోర్టల్ నిర్వహణ, సన్నద్ధతపై సీఎస్ సోమేశ్ కుమార్ అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు హాజయర్యారు. రాష్ట్రంలోని భూముల వివరాలన్నీ దసరా నుంచి ధరణి పోర్టల్‌లోనే నమోదు చేయనున్నారు. దీనికోసం పోర్టల్‌ను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధంచేసింది. దేశంలోని మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ సంస్కరణలను చేపట్టింది. ఇందులో భాగంగా కోర్ బ్యాంకింగ్ తరహాలో భూమి లావాదేవీలు నిర్వహించే పక్రియకు సీఎం కేసీఆర్ సర్కారు శ్రీకారంచుట్టింది. ఇందులో కీలకమైన 'ధరణి' పోర్టల్‌ను ఇప్పటికే రూపొందించింది. భూ రికార్డుల నిర్వహణ పూర్తి పారదర్శకంగా జరిగేలా పోర్టల్‌ను తయారుచేశారు. దీనివల్ల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అయితే వర్షాలు, వరదలతో తాత్కాలికంగా నిలిపి వేయాలని, తిరిగి ఎప్పుడు కొనసాగించేది తెలియచే÷-తామని చెప్పినట్లు తెలుస్తోంది.

విప్లవాత్మకంగా 'ధరణి' : సీఎస్ సోమేశ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 17: ధరణి పోర్టల్ దేశంలోనే విప్లవాత్మకంగా నిలుస్తుందని సోమేశ్‌కుమార్ అన్నారు. శనివారం పోర్టల్ సన్నద్ధతపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వీసీకి అదనపు కలెక్టర్లతో పాటు తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్లు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ముఖ్యమంత్రి కేసీఆర్ పోర్టల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 570 మండలాల్లోని తహసీల్దార్లు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా పని చేస్తారని, సబ్ రిజిస్ట్రార్ అధికారులు 142 ప్రదేశాల నుంచి వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేస్తారని చెప్పారు. పోర్టల్ పారదర్శకంగా, భద్రతా ప్రమాణాలతో ఉంటుందని చెప్పారు. ధరణి పోర్టల్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించి, అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

తహసీల్దార్లు రేపటి కల్లా కనీసం పది లావాదేవీలను ప్రయోగాత్మకంగా పూర్తి చేయాలని సూచించారు. ధరణి సేవలకు అంతరాయం కలుగకుండా చూసేందుకు డిస్కమ్, బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్ ప్రొవైడర్లు, టీఎస్‌టీఎస్ ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వీసీలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీ శేషాద్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి రిజ్వీ, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టియానా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతు ప్రసాద్, ఫైనాన్స్ ప్రత్యేక కార్యదర్శి రోనాల్డ్ రాస్, పీఆర్ఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, టీఎస్‌టీఎస్ ఎండీ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పర్యటించిన మంత్రి పేర్ని నాని

పునరావాస కేంద్రాల ప్రజలకు భరోసా

అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

విజయవాడ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పర్యటించారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని మోపిదేవి మండలం కే.కొత్తపాలెం, బొబ్బర్లంక అవనిగడ్డ మండలం పాతఎడ్లలంక పునరావాస కేంద్రాల్లో ఉన్న గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి 9 లక్షల 40,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయటంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం బ్యారేజి నుంచి అవనిగడ్డ వరకు వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం తో పాటు పామర్రు పెనమలూరు నియోజకవర్గంలో కూడా పర్యటించి అధికారులు అందర్నీ అప్రమత్తం చేశామని చెప్పారు. లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని అన్న ఆయన కే.కొత్తపాలెం వద్ద గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రతిఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామన్న మంత్రి నియోజకవర్గంలోని కే.కొత్తపాలెం బొబ్బర్లంక పాతఎడ్లలంక గ్రామస్తులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

రెవెన్యూ పోలీసు పంచాయతీ వైద్య శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వరద ఉధృతి గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉండే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా కృష్ణానది దిగువకు వరద పెరుగుతున్న దృష్ట్యా కరకట్టను మంత్రి పేర్నినాని పరిశీలించారు. అనంతరం తోట్లవల్లూరు యం పి డి వో కార్యాలయంలో సమావేశం నిర్వహించి పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ లంక గ్రామ ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించామని మిగిలిన వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు వివరించారు. వరద బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మోపిదేవి మండలం కె. కొత్తపాలెం గ్రామంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని పరామర్శించి అక్కడి ఏర్పాట్లు, వారికందుతున్న సహాయ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఎటువంటి ఆందోళన వద్దని బాధితులకు వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మోపిదేవి ఎమ్మార్వోలు,అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమేశ్వర రవి కుమార్,ఎస్సై సురేష్, ఇరిగేషన్ డి.ఈ,ఏ.ఈ లు పలు శాఖల అధికారులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమరరాజాకు 'టాలెంట్ యాక్సిలరేటర్ ఫర్ ఇండియా -2020' అవార్డు

తిరుపతి,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): వ్యాపార పరివర్తనలో క్లిష్టమైన పురోగతులు సాధించినందుకు గాను 'టాలెంట్ యాక్సిలరేటర్ ఫర్ ఇండియా – 2020' అవార్డు ని అమర రాజ బ్యాటరీ సంస్థ కైబివసం చేసుకుంది. అమర రాజా గ్రూప్‌కు భారతదేశంలో 4వ వార్షిక ఐడిసి డిజిటల్ ట్రాన్స్ఫార్మేషన్ అవార్డులలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు ని దక్కించుకుంది. ఏడు విశిష్ట విభాగాలలో విజేతలలో ఒకరిగా ఎంపికైన ఈ గ్రూప్, 'పీపుల్‌స్ట్రాంగ్' భాగస్వామ్యంతో అమలు చేయబడిన దాని ట్రాన్స్ఫార్మేషన్ ఆఫ్ పీపుల్ సిస్టమ్స్ అండ్ ప్రాసెసెస్ ప్రాజెక్ట్ కోసం గౌరవనీయమైన అవార్డును పొందింది. ఇది ఆసియా పసిఫిక్ అంతటా అసాధారణమైన 1200 అధిక నాణ్యత ఎంట్రీలను మించిపోయింది.

గ్రామాల్లో పెద్దగా కానరాని బతుకమ్మ సందడి

కరోనాకు తోడు వరదలతో తగ్గిన ఆసక్తి

హైదరాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): పూల పండగను తీసుకుని వచ్చిన బతుకమ్మ సంబరాలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయినా మునుపటి సందడి కానరావడం లేదు. కరోనాతో పాటు వరదల కారణంగా ఆడపడుచులు పండగపై పెద్దగా మక్కువ చూపడం లేదు. గ్రామల్లో పరిమితంగానే బతుకమ్మను ఆడుతున్నారు. గతంలో ఎక్కడ చూసినా పూల అమ్మకాలు బాగా కనిపించేవి. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబురం రాకతో తెలంగాణ లోగిళ్లలో పండగ కళ వచ్చేది. రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ కోసం ఆడపడుచులు తమ స్వగ్రామాలకు చేరుకునే వారు. అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడం, విద్యార్థినులు, మహిళలు స్వగ్రామాలకు చేరుకుంటున్న దృశ్యాలు కానరావడం లేదు. తొమ్మిది రోజులు ఆడే బతుకమ్మ శుక్రవారం ఎంగిలి పూలతో ఆరంభం అయ్యింది. అమావాస్య నుంచి మొదలైన బతుకమ్మ ఆట తొమ్మిది రోజులు ఆడతారు.రోజూ ఆటల్లో పడి ఇంటి, పంట పనులు మరిచి పోతారు. ఆరో రోజున బతుకమ్మను పక్కకు పెట్టి మిగిలిపోయిన పనులు చూసుకుంటారు. బతుకమ్మల రాకతో పూలకు గిరాకి పెరిగేది. వర్షాలు పడడంతో పూల ఉత్పత్తులు కూడా బాగా తగ్గాయి. రైతులు సాగుచేసిన బంతిపూల తోటలకు బతుకమ్మ పండగ గిరాకీ ఏర్పడేది. బతుకమ్మ పండగ నేపథ్యంలో విక్రయాలు జరుగుతాయనే ముందు చూపుతోనే రైతులు ఈ పూల సాగుచేపట్టగా సరిగ్గా పండగ సమయానికే వర్షాలు పడడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. హైదరాబాద్ చుట్టుపక్కల భారీగా పంటలు దెబ్బతిన్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే బతుకమ్మ పండుగ కోలాహలంగా అంగరంగ వైభవంగా ప్రారంభం కావాల్సి ఉన్నా ప్రస్తుత పరిస్థితుల్లో సాదాసీదాగా మొదలయ్యింది. ఏటా ఇప్పటికే ప్లలెల్లో పండగ శోభ సంతరించుకుంటుంది. చిన్నారుల నుంచి వృద్ధుల దాకా.. బతకమ్మ సంబరాలను ఆస్వాదించడానికి గ్రామాలకు చేరుకుంటారు. ఇన్నాళుల్లు చదువులకు పట్టణం వెళ్లినా.. పండగ నేపథ్యంలో విద్యార్థినులు సొంతూరుకు చేరుకునే వారు. దీంతో ఇళ్లలో ఆడ బిడ్డల సందడి మొదలయ్యేది. ఆడపిల్లలు ఆత్మీయ దేవతగా ఆరాధించే బతుకమ్మ ప్రకృతి ప్రాముఖ్యతను చాటుతుంది. ఇక వరుసగా గత ఐదేళ్లుగా వైభవంగా బతుమ్మను నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఈ యేడు దాని ఛాయలకు పోవడం లేదు. వరదలు, వర్షాల ప్రభావం తీవ్రంగా పడింది. అయితే ఈ సారి బాగా వర్షాలు పడడంతో తెలంగాణ వ్యాప్తంగా చెరువులు నిండిబతుకమ్మలు వేయడానికి అనువుగా మారింది. దీనికితోడు అడవిలో దొరికే పూలకు ఢోకా లేకుండా పోయింది. స్థానికంగా లభించే తంగేడు, గునుగు,గడ్డి పూలు విరగ పూసాయి. ఈ పండగను తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇంతటి విశిష్టత కలిగిన పండగ తెలంగాణాలోనే కాకుండా దేశ విదేశాల్లోనూ ఘనంగా జరుపుకొంటారు. బతుకమ్మలతో చెరవు గట్లకు చేరుకొని అమ్మవారి మహిమలను కీర్తిస్తూ పాటలు పాడుతూ.. ఆనందంగా గడుపుతారు. తెలంగాణ పండగగా గుర్తింపు పొందిన బతుకమ్మకు ఎంతో ప్రాముఖ్యముంది. బతుకమ్మ అంటేనే గుర్తుకు వచ్చేది పూల సందడి.. వివిధ రకాల పూలను ఏడు దశల్లో అలంకరించి పూజించడం ఆనవాయితీ.. పూలను గౌరీదేవి ప్రతిరూపంగా కొలుస్తూ మహిళలు పాటలు పాడుతారు. బతుకమ్మను అమ్మగా కొలవడం వల్లే బతుకమ్మగా పేరొచ్చింది.

దుబ్బాకలో ఊపందుకున్న ప్రచారం

పోటాపోటీగా నేతల ప్రదర్శనలు

పరస్పర విమర్శలతో వేడెక్కిన ప్రచారహోరు

సిద్దిపేట,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): దుబ్బాకలో ప్రచారం ఊపందుకుంది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రధాన పార్టీల నేతలు ప్రాచరంలో దూకుడు పెంచారు. ప్రధానంగా అధికార టిఆర్ఎస్‌పై కాంగ్రెస్, బిజెపిలు విమర్శలు సంధిస్తున్నారు. రాష్ట్రాన్ని కుటుంబ పాలన నుంచి కాపాడాలని, దుబ్బాకలో గెలిపించి కెసిఆర్ కళ్లు తెరిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఉత్తమ్, భట్టి,కోమటిరెడ్డి, జీవన్ రెడ్డి, విహెచ్ తదితరులు ఇప్పటికే ఓ రౌండ్ ప్రచారంలో పాల్గొన్నారు. ఇక బిజెపి నుంచి రఘునందన్ రావు ప్రచారంలో ముందున్నారు. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. టిఆర్ఎస్ ఇక ఆకర్మ్‌తో ఇతర పార్టీలను ఆత్మరోణలో పడేయాలని చూస్తోంది. అయితే ఇవేమీ పట్టించుకోకుండా కాంగ్రెస్,టిఆర్ఎస్‌లు ప్రచారంలో దూసుకుని పోతున్నాయి. ఇక బీజేపీ , కాంగ్రెస్ పార్టీలు రాష్ట్ర నాయకులతోనే గ్రామాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు శుక్రవారంతో గడువు ముగిసింది.ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 46 మంది అభ్యర్థులు 103 నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు.నామినేషన్ల గడువు ముగియడంతో ఇక అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టిసారించాయి. దుబ్బాక ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించేలా పక్కా వ్యూహంతో టీఆర్ఎస్ పార్టీ ముందుకు వెళుతున్నది. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ గ్రామాల్లో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక నవంబర్ 3న జరగనున్నది. సమయం దగ్గర పడుతున్న కొద్ది ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. టీఆర్ఎస్ నుంచి సోలిపేట సుజాత, కాంగ్రెస్ నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్‌రావుతో పాటు ఇతరులు కొందరు తమ నామినేషన్లు దాఖలు చేశారు. టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత ప్రచారంలో దూసుకుపోతున్నది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొనేలా పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత వెంట మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మహిళా ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సుజాత గ్రామాలకు వెళ్లినప్పుడు ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. మంత్రి హరీశ్‌రావు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ప్రచారం నిర్వహిస్తు న్నారు. సిద్దిపేట, గజ్వేల్, ఇతర నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో యువత, విద్యార్థి విభాగాల నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలప్పుడే మీరు మా వద్దకు వస్తారు తప్ప...ఎన్నికలు అయిపోయాక ఇటు మోహం కూడా చూపించరని మంత్రి హరీష్ రావు కాంగ్రెస్, బిజెపిలను విమర్శిస్తున్నారు.

అమ్మవారికి ఎస్.బి.ఐ. భారీ విరాళం

-23 లక్షలతో 27 సీట్ల బస్సు దేవస్థానానికి అందజేత

విజయవాడ,అక్టోబరు,17(ఆర్ఎన్ఎ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి అమ్మవారి దేవస్థానానికి భక్తుల సౌకర్యార్థం బస్సును అందజేయడం జరిగిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ పి. శివకుమార్ తెలిపారు. శనివారం శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్, కార్యనిర్వాహణాధికారికి ఇంద్రకీలాద్రి పై ఎస్.బి.ఐ.అధికారులు వాహనాన్ని అందించి అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం 27 సీట్లు గల మినీ బస్ ను అందించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ మహత్కార్యంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆన్ లైన్ ద్వారా హైదరాబాదు నుండి చీఫ్ జనరల్ మేనేజరు సంజయసహాయ్ ఈ బస్సును విరాళంగా దేవస్థానానికి అందజేశారు. డి.జి.యం వై. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ అమ్మవారి సేవలో భాగస్వామ్యమవ్వడం పట్ల సంతషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్.బి.ఐ. గాంధి నగర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. దేవస్థానం ఛైర్మన్ పైలా స్వామినాయుడు , కార్యనిర్వాహణాధికారి యం.సురేష్ బాబు దేవస్థానం తరపున ఎస్.బి.ఐ. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 27 సీట్ల మినీ బస్సు భక్తులకు ఎంతో సహాయంగా నిలుస్తుందన్నారు. మూలధనం నిధి కింద బస్ దేవస్థానం భక్తులకు సేవలందిస్తుందని వారు తెలిపారు. అనంతరం ఇంద్రకీలాంద్రి పై గాంధినగర్ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ పి. శివకుమార్ నేతృత్వంలో జి.యం., డిజియంలు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వర్ణకవచాలంకృత కనక దర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శంచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమ పాదయాత్రగా బయలుదేరి దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది. క్యూలైన్లలో ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేయాలి. క్యూలైన్లలో భక్తులకు శానిటైజర్లు అందుబాటులో ఉంచాలి. అమరావతి రైతులకు న్యాయం జరగాలని అమ్మవారిని కోరుకున్నా నంటూ దర్శనాంతరం ఉమా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

పేదలకు అండగా సిఎం సహాయనిధి

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): పేదలకు సీఎం సహాయనిధి భరోసా అని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది లబ్దిదారులకు ఆయన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని వారికి సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం తోడ్పాటునం దిస్తున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ మానవతావాదంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాళ్ల మురళీధర్ రెడ్డి, లునావత్ అశోక్, వెంకన్న, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే శంకర్ నాయక్

ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద

పోలీసులను అప్రమత్తం చేసిన అధికారులు

లంక గ్రామాల్లో సహాయక చర్యల్లో ముందున్న పోలీసులు

విజయవాడ,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజ్ కు వరదనీరు భారీగా చేరుతుండటం, ఈ వరద ఇంకా పెరగ వచ్చనే సమాచారం మేరకు కృష్ణా జిల్లా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసింది. ఉన్నతాధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి పునరావాసం ఏర్పాటు చేయడంలో ముందున్నారు. సంబందిత శాఖలకు సహాయ సహకారాలు అందించడమే కాకుండా వరదల వల్ల నిరాశ్రయులైన వారికి ఆహార ఏర్పాట్లు చేయడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ముందున్నది. చల్లపల్లి, ఘంటసాల, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మరియు కూచిపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలోని నది పరివాహక ప్రాంతాల్లో, లంక గ్రామాలలో పోలీస్ యంత్రాంగం అన్ని వేళల ప్రజలకు అందుబాటులో వుండాలని ఎస్పి ఎం రవీ ంద్రనాథ్ బాబు ఆదేశించడంతో అవనిగడ్డ సబ్ డివిజనల్ అధికారి ఓ రమేష్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది లంక గ్రామాలలో సహాయక కార్యక్రమాలు చేపట్టారు. ఒక వైపు జిల్లాలో శాంతి భద్రతలకు ఏటువంటి విఘాతం కలుగకుండా పర్యవేక్షించడంమే గాక శాంతి భద్రతల పర్యవేక్షణలో గ్రామ రక్షణ దళాల ద్వారా ప్రజలను సైతం భాగస్వాములను చేసి ముందుకు నడిపిస్తున్నారు. మరోవైపు ఇసుక, మద్యం అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణిచి వేస్తూ, పరివర్తన అనే కార్యక్రమాలతో వెనుకబడిన ప్రాంతాల ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. వారికి మెరుగైన జీవన ఉపాధి కల్పించడం కొరకు జాబ్ మేళా వంటి అనేక కార్యక్రమాలు చేపడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిచి వారి మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తున్నారు. పోలీస్ అంటే ప్రజా–ప్రభుత్వ ఆస్తుల, మాన ప్రాణాలను కాపాడే వాడే కాదు ప్రజల జీవితాల్లో వెలుగును నింపే వాడని నిరూపిస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన వేళ ఆపద్బాంధవుడులా ఉంటూ సిబ్బందిని ముందుకు నడిపిస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రవీంద్రనాథ్ బాబుని అని వర్గాల ప్రజలతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రశంసలతో ముంచెత్తు తున్నారు. ఖాకీ గుండెల మాటున కాఠిన్యమే కాదు, మానవత్వంతో స్పందించే మనసు ఉందని రుజువు చేస్తున్న వీరు అభినందనీయులు.

కోర్టులపై లేఖలు రాయడం కొత్తేమీ కాదు

-గతంలో సిఎం సంజీవయ్య కూడా లేఖ రాశారు

-ప్రముఖుల కేసుల విచారణను వర్చువల్‌గా ప్రసారం చేయాలి

-న్యాయవ్యవస్థలో లోపాలను సరిదిద్దాల్సిందే

-జస్టిస్ రమణపై ఆరోపణలను నమ్మను

మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్

రాజమండ్రి,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): కోర్టులపై ముఖ్యమంత్రి లేఖ రాయటం ఇదేమీ కొత్త కాదని రాజమండ్రి మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గతంలో ముఖ్యమంత్రి సంజీవయ్య కూడా 1960లోనే కోర్టులపై లేఖ రాశారని గుర్తు చేశారు. లేఖ రాయటం కంటే జగన్ ప్రెస్ మీట్ పెట్టి చెప్పటం తప్పా? రైటా అనే విషయం పైనే చర్చ జరుగుతోందని, అయితే జగన్ అన్ని విషయాలలో మొండిగా వెళతారని శనివారం నాడిక్కడ మీడియా సమావేశంలో అన్నారు. జస్టిస్ రమణ విషయంలో ఆరోపణలు వ్యక్తిగతంగా తాను నమ్మనని అన్నారు. న్యాయవ్యవస్థలో లోపాలను రాజకీయ వ్యవస్థలు సరిదిద్దాలని,. చట్టం ముందు జడ్జీలు అతీతులు కాదని కూడా అన్నారు న్యాయవ్యవస్థలపై ఆరోపణలు విషయంలో చర్చ గౌరవంగా జరగాలి. న్యాయ వ్యవస్థకు ప్రభుత్వానికి మధ్య విభేదాలు వస్తే ప్రజలకు నష్టం కనుక ప్రభుత్వం ఏ పని అయినా చట్టబద్ధంగా చేయాలని అబిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థపై జరుగుతున్న చర్చపై ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందించారు. జగన్ ముఖ్యమంత్రి కాక ముందు లక్ష కోట్ల రూపాయలు దోచేశారని ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రి నిందితుడుగా విచారణ జరగబోతోంది. రాజకీయ నాయకులపై కోర్టులో విచారణ జరిగినప్పుడు లైవ్ ఇవ్వాలి. కోర్టులో విచారణ లైవ్ టెలీక

కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరదనీరు

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
దిగువకు చేరుతున్న నీరు

మహబూబ్‌నగర్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): కృష్ణా తీరంలో భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. జూరాల, శ్రీశంల, సాగర్‌లకు వరద ప్రవాహం

భారీగా వరదనీరు చేరడంతో శ్రీశైలం జలాశయం గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలిన అధికారులు

కొనసాగుతోంది. శ్రీశైలానికి ఎగువ నుంచి వరద పొటెత్తుతోంది.

గంటగంటలకు ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువన కర్ణాకటలో భారీ వర్షాలు కురుస్తుండటం, తుంగభద్ర, జూరాల గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తుండటంతో భారీగా వరద వస్తోంది. శనివారం ఉదయానికి జలాశయానికి ప్రవాహం వస్తుండగా.. ఇప్పటికే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో అధికారులు ప్రాజెక్టు 10 గేట్లను 33 అడుగుల మేర ఎత్తి దిగువ స్పిల్ వే ద్వారా నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం ద్వారా పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్ఎ÷-లో భారీగా వస్తుండటంతో ఇంజినీర్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముందు జాగ్రత్తగా ఇప్పటికే ప్రాజెక్టును సుమారు మూడు అడుగుల మేర ఖాళీ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.3 అడుగులుగా ఉంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు ప్రాజెక్టు 18 క్రస్టుగేట్లను 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా నదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి కాల్వలకు 4 వేల క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్ర ద్వారా 29,063 క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 3575 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా జలాశయం నుంచి 5,11,097 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగిస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 588.8 అడుగులుగా ఉంది.

కాంగ్రెస్,బిజెపిలు రైతులను ఆగం చేసిన పార్టీలు

ఉప ఎన్నికలో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలి
ప్రచారంలో మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): గతంలో రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పెడితే.. ఇప్పుడేమో బావుల వద్ద మోటార్లకు

దుబ్బాకలో పలు ప్రాంతాల్లో గురువారం ప్రచారం నిర్వహించిన మంత్రి హరీష్ రావు. చిత్రంలో టిఆర్ఎస్ అభ్యర్థి సుజాత, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలు ఉన్నారు.

మీటర్లు పెట్టి బీజేపీ ఇబ్బంది పెడుతుందని ఆర్థిక మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన పార్టీలు ఆటాడుకుంటున్నాయని, అలాంటి పార్టీలను దుబ్బాకలో రానిద్దామా అని అన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో భాగంగా దౌల్తాబాద్ మండలంలోని ముబారన్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో హరీష్‌రావు పాల్గొని ప్రసంగించారు.

దుబ్బాక నియోజకవర్గ తొలి మహిళ ఎమ్మెల్యే సోలిపేట సుజాతనే.. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వడం లేదు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు.. కనీసం తాగునీటి సమస్యను కూడా తీర్చలేదు అని మంత్రి గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. వానాకాలంలో ఉసిల్లు వచ్చినట్లు.. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు వచ్చిపోతారు అని హరీష్ రావు విమర్శించారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేది కేవలం టీఆర్ఎస్ పార్టీ మాత్రమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఎండమావులు వంటివే.. వాటి వెంటపోతే ఏమీ రాదని హరీష్ రావు తేల్చిచెప్పారు. ఆయన వెంట సుజాతతో పాటు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవందర్ రెడ్డిలు ఉన్నారు.

అనారోగ్యాల పై అప్రమత్తంగా ఉండండి

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల ఆరోగ్యం
ప్రవేట్ ఉపాధ్యాయులకు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచన

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (నేటినిజం ప్రతినిధి):ప్రస్తుత కరోన వైరస్ విజృంభణ లో భాగంగా నీజనల్

వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, దీనితోపాటు తమ విద్యార్థులకు అవగాహన కల్పించాలంటూ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పిలుపునిచ్చారు.

వేములవాడ పట్టణ పరిధి లోని మహా లింగేశ్వర ఫంక్షన్ హాల్ లో కరోనాను నివారించడానికి ప్రవైట్ ఉపాధ్యాయులకు ఆయన అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. సొసైటీ డెవలప్ కావాలంటే విద్య ఎంతగానో అవసరం అని అందుకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతగానో ఉంటుంది అని అన్నారు.

విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెపితే విని క్రమం తప్పకుండా పాటిస్తారని అందుకే ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దగ్గు లేదా తుమ్ము ఉన్నవారి నుండి కొంత దూరంగా ఉండాలని,ప్రతి ఒక్కరు మాస్కును ధరించాలని అన్నారు.

కళ్ళు, ముక్కు లేదా నోటిని తరచుగా తాకవద్దని చెప్పారు.

శ్వాస తీసుకోవడం లో ఇబ్బంది వున్నా కరోనా లక్షణాలు ఉన్నట్టు అనిపించినా వైద్యుడిని సంప్రదించి, ఇంట్లోనే ఉండాలి అని ప్రతీ ఒక్కరు వైరస్ పట్ల అవగాహన కలిగి ఉండి మనతో పాటు మన చుట్టు వుండే వారికీ కూడా వైరస్ పట్ల అవగాహన కలిగించి జాగ్రత్త గా ఉండాలి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్, టి. ఆర్. కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్ట మహేష్ కుమార్ ,,ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్ , టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీం పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

రాజన్నసిరిసిల్ల,అక్టోబర్17(నేటినిజం ప్రతినిధి): జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్, బైపాస్ శివారులో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వీరి నుంచి రూ.5,600 నగదుతోపాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజీవ్‌నగర్, బైపాస్ శివారులో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా కొందరు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు ఉదయం టాస్క్ ఫోర్స్ సీఐ రవికుమార్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. పట్టుబడిన నిందితులను సిరిసిల్ల పోలీసులకు అప్పగించారు. దాడుల్లో టాస్క్ ఫోర్స్ సీఐ రవికుమార్, ఆర్ఐ (అడ్మిన్) సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిఆర్ఎఫ్ వాహనాలు ప్రారంభించిన -మంత్రి గంగుల

కరీంనగర్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎలాంటి విపత్తులు సంభవించినా తక్షణమే స్పందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నది. ఈ మేరకు పోలీసులు, ఇతర విభాగాల అధికారులకు సకల సౌకర్యాలను సమకూర్చుతున్నది. ఇప్పటికే విపత్తులను ఎదుర్కొనేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చుకున్నప్పటికీ.. ప్రభుత్వం వాటిని మరింత వృద్ధి చేస్తున్నది. ఈ క్రమంలోనే ప్రభుత్వం శనివారం ఉదయం కరీంనగర్‌లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) వాహనాలను ప్రారంభించింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆహార సరఫరా శాఖల మంత్రి గుంగుల కమలాకర్ చేతుల మీదుగా

ఈ వాహనాల లాంచింగ్ జరిగింది. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో ఈ డీఆర్ఎఫ్ వాహనాల లాంచింగ్ కార్యక్రమం జరిగింది. మంత్రి గంగులతోపాటు కరీంనగర్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నేతలు, అధికారులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడంలో డీఆర్ఎఫ్ వాహనాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విపత్తు జరిగిన ప్రాంతానికి డీఆర్ఎఫ్ బృందాలు తక్షణమే చేరుకోవడానికి ఈ వాహనాలు ఉపయోగపడుతాయన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): సరదాగా చేపలు పట్టేందుకు వచ్చి చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ లోని టోలీచౌకీ చెందిన వ్యక్తి రెండురోజుక్రితం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని అత్తవారింటికి వచ్చాడు. శనివారం సరదాగా చేపలు పట్టేందుకు నాగర్ కర్నూల్‌లోని కేసరి సముద్రం చెరువు వద్దకు వచ్చాడు. చెరువులో చేపలు పట్టి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. స్థానికులు రక్షించేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది సాయంతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు.

నాగర్‌కర్నూలు వద్ద ఉద్రిక్తత

కల్వకుర్తికి వెళ్లకుండా కాంగ్రెస్ నేతలకు అడ్డుకట్ట
కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
రేవంత్ కాలికి స్వల్పంగా గాయాలు
సర్కార్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

నాగర్‌కర్నూల్,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): నాగర్‌కర్నూల్‌లో ఉద్రికత్త నెలకొంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు బ్లాస్టింగ్‌తో నీట మునిగిన కల్వకుర్తి పంప్ హౌస్‌లను పరిశీలించేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నేతతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి కాలికి గాయమైంది. నాగర్ కర్నూలు జిల్లా ఎల్లూరు వద్ద నీట మునిగిన కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పంప్ హౌజ్ పరిశీలనకు వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకుంది. సీనియర్ నేతలు మల్లు రవి, సంపత్ కుమార్, ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తదితర కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన బయల్దేరి వెళ్లారు. అయితే మార్గమధ్యంలోనే తెలకపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా బైఠాయించారు. కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో రేవంత్ కాలికి గాయం అయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరంకుశత్వం నడుస్తోందని విమర్శించారు. ప్రమాదం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతిపక్షానికి ఉందని, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమాలను కప్పిపుచ్చు కునేందుకే.. ప్రభుత్వం తమని అనుమతించడం లేదని ఆరోపించారు. కల్వకుర్తి పంపుహౌస్ నీట మునిగిపోయింది. ప్రభుత్వ నిర్వాకంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. పాలమూరు- రంగారెడ్డి ఫస్ట్ పంపుహౌస్‌తో పాటు అప్రోచ్ చానల్ కోసం భూగర్భంలో చేపట్టిన పేలుళ్లతోనే ఈ ప్రమాదం జరిగింది. కల్వకుర్తి పంపుహౌస్‌లో డ్రాఫ్ట్ ట్యూబ్‌లను ఆనుకొని ఉన్న గోడల్లో పగుళు వచ్చి మోటార్లు మొత్తం నీటిలో మునిగిపోయాయి. మూడో మోటారు దెబ్బతిని దాని నుంచి నీళ్లు పైకి ఉబికి వస్తున్నాయి. మూడో మోటారు బేస్మెంట్ కూడా పగిలిపోయినట్టు తెలుస్తున్నది. పాలమూరు ప్రాజెక్టులో అండర్ గ్రౌండ్ పంపుహౌస్ నిర్మిస్తే కల్వకుర్తి పంపుహౌస్ దెబ్బతింటుందని సీనియర్ ఇంజనీర్లు హెచ్చరించినా.. రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. దీనిపై సమాచారం అందుకున్న కాంగ్రెస్ నేతలు ప్రాజెక్ట్‌ను సందర్శించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, సంపత్ కుమార్, మల్లురవిలను బలవంతంగా అరెస్ట్ చేసి తెలకపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కాలికి గాయమైంది. ప్రభుత్వం కోట్లాది రూపాయాల్ని వృధా చేస్తుందని ప్రశ్నించిన పాపానికి తమపై దౌర్జన్యం చేయడం దారుణమంటూ మండిపడ్డారు.

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ భట్టి

తెలంగాణ రాష్ట్రం వర్షాలకు వెనిస్ నగరంలా కనిపించిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తాంబుల్, దల్లాస్ చేస్తామన్నారని.. మంత్రి కేటీఆర్ విశ్వనగరం అన్నారని వాళ్లు చెప్పిన మాటలన్నీ ఏమయ్యాయి..? అని ప్రశ్నించారు. అసలు 72 వేల కోట్ల రూపాయిల అభివృద్ధి ఎటు పోయిందని మీడియా ముఖంగా భట్టీ అడిగారు. టీఆర్ఎస్‌ను దూరం పెట్టి నగరాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కల్వకుర్తి ప్రాజెక్టు పంపు హౌజ్ మునకకు గత ప్రభుత్వం కారణం అనడానికి సిగ్గుండాలన్నారు. పాలమూరు ప్రాజెక్టులో అండర్ గ్రౌండ్ పంప్ హౌజ్ నిర్మించొద్దని నిపుణుల కమిటీ చెప్పిందన్న విషయాన్ని మరోసారి ఆయన గుర్తు చేశారు. అండర్ గ్రౌండ్ బ్లాస్ట్‌లతో కల్వకుర్తికి నష్టం జరుగుతుందని చెప్పారు. కేవలం కాంట్రాక్టర్లకు లబ్ది కోసం అండర్ గ్రౌండ్ పంప్ హౌజ్ నిర్మాణం చేపట్టారని.. తన అనుకూలమైన ఈఎన్సీకి మినహాయింపు ఇచ్చి ఇరిగేషన్ శాఖను సర్వనాశనం చేశారని భట్టీ మండిపడ్డారు. ఈఎన్సీ మురళీధర్ రావు ఇచ్చిన అన్ని పనులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ధరణితో ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌కు సంబంధం లేదు

ఎల్ ఆర్ యెస్ స్లాట్ బుకింగ్ చేసుకోండి
బైపాస్ ఖబ్రస్థాన్‌లో మౌళిక వసతులు కల్పించాలి
ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఆస్తుల నమోదు ధరణి కార్యక్రమానికి ఎన్ఆర్సీ, ఎన్ పీఆర్ లకు ఎలాంటి సంబంధం లేదని

ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. శనివారం నగరంలో పార్టీ కార్యాలయం దారుస్సలాంలో లాక్డౌన్ అనంతరం పార్టీ కార్పొరేటర్‌లతో, ముఖ్య నేతలతో కలిసి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ సమగ్ర ఆస్తుల నమోదు చేసుకోవడానికి మాత్రమే ధరణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇది కేంద్ర ప్రభుత్వ ఆలోచనకు, పాలసీకి సంభంధం లేదని స్పష్టం చేశారు. కొంత మంది ముస్లింలు ధరణి కార్యక్రమానికి సహకరించడం లేదని తమ దృష్టికి వచ్చిందని ఈ నేపథ్యంలో వారిలో నెలకొన్న అపోహలు తొలగించడానికి ఈ ప్రకటన చేశామన్నారు. ఖాళీ స్థలాలు ఉన్నవారు ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు అక్టోబర్ 30 లోగా స్లాట్ నమోదు చేసుకోవాలని ఇది ప్రజలకు ప్రయోజనకరమన్నారు. ఏండ్ల తరబడి ఇంటి పన్ను కట్టని వారు అక్టోబర్ నెల చివరి వరకు కట్టుకుంటే ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ చేసిందని ప్రజలు ఇట్టి ప్రయోజనాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ఇక కరీంనగర్ రామగుండం బైపాస్ రోడ్ లో గల ముస్లిం స్మశాన వాటిక (ఖబ్రస్థాన్) ప్రహరీ గోడ వరద ప్రవాహానికి కూలిపోయిందని, కూలిన గోడ నిర్మాణంతో పాటు మౌళిక వసతుల కల్పన కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కు, మేయర్ సునీల్ రావుకు కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న మంగళవారం ఎంఐఎం కార్పొరేటర్లతో పాటు నగర కమిటీ, తాను కలిసి ఖబ్రస్థాన్ లో కూలిన గోడను,కావాల్సిన మౌళిక సదుపాయాల కల్పనకు సంబంధించిన విషయమై క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించనున్నట్లు చెప్పారు. ఇక పాత మున్సిపల్ డివిజన్లు కొత్తగా మారిన దృష్ట్యా ఆయా డివిజన్లలో నూతనంగా కమిటీలను తమ పార్టీ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ సూచనల మేరకు ఎన్నుకుంటామన్నారు. పైన చర్చించిన విషయాలన్నీ ఆయా డివిజన్లలో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, కార్పొరేటర్లు మహ్మద్ అఖీల్ ఫిరోజ్, మహమ్మద్ శర్ఫుద్దీన్, నాయకులు యువనేతలు ఆతిన, అలిబాబా, అజహర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు టి.ఆర్.కె సహాయం చేయడం అభినందనీయం !

- నిత్యావసర సరుకుల పంపిణీ..
- హాజరైన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (నేటినిజం ప్రతినిధి):లాక్ డౌన్ తో ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు టి. ఆర్ .కె ట్రస్టు సహాయం అందించడం అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.

వేములవాడ పట్టణంలో ని ప్రైవేట్ ఉపాధ్యాయులకు శనివారం ట్రస్టు వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆదేశాల మేరకు టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే మాట్లాడుతూ కోవిడ్-19 నియమ నిబంధనలను పాటించాలని అందరితో ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాక్ డౌన్ లో ముఖ్యంగా ఉపాధి కోల్పోయిన ఉపాధ్యాయులకు టి.ఆర్.కె ట్రస్ట్ సహాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ తాను పుట్టిన గడ్డ రుణం తీసుకోవడానికి ట్రస్ట్ స్థాపించక ముందే పట్టణంలో నీటి ఎద్దడిని తీర్చడానికి బోర్లు వేసి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం ఆయన దుబాయిలో వ్యాపారాల్లో డబ్బు సంపాదించి పుట్టిన గడ్డ రుణం

తీర్చుకోవడానికి టి.ఆర్.కె ట్రస్ట్ నెలకొల్పి ఎంతోమంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారని గుర్తు చేశారు. అలాగే కరోనా సమయంలో సుభాష్ నగర్ రెడ్ జోన్ లో దాదాపు 800 ల కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. అలాగే ట్రస్ట్ నెలకొల్పిన అప్పటినుండి టి.ఆర్.కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్, ఎంక్వయిరీ టీమ్ స్వచ్ఛంద సేవ చేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ లాక్ డౌన్ తో పాఠశాలలు మూతపడడంతో మేము ఉపాధి కోల్పోయామని ఆలాంటి మాకు టి ఆర్ కె ట్రస్టు తరపున తోట రామ్ కుమార్ నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. . ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ లు పుప్పుల దేవరాజు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, ట్రస్ట్ ప్రతినిధి గంగవరం శ్రీధర్, వర్కింగ్ టీమ్, ఎంక్వయిరీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దుర్గ మాత విగ్రహాల ప్రతిష్టాపన...

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (నేటినిజం ప్రతినిధి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందుర్తి మండలంలో పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించారు, మండల కేంద్రంలో సెస్ కార్యాలయంలో సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు, సందర్భంగా అమ్మవారికి అల్లాడి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు, ప్రతి సంవత్సరం కార్యాలయంలో వినాయక ప్రతిష్టాపన, దుర్గామాత ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు, అలాగే మండలంలో బండపల్లి గ్రామంలో పల్లె మీద యువచైతన్య యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు, ఇదే గ్రామంలో యువసేన యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత ను ప్రతిష్టించారు, అలాగే చందుర్తి, లింగంపేట, మర్రిగడ్డ, మల్యాల గ్రామంలో కూడా దుర్గమాతలను ప్రతిష్టించారు, దుర్గామాత మండపాల వద్ద

అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రతిష్టించారు, అమ్మవారు మొదటి రోజు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు, ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, బండపల్లి గ్రామం లో యువ చైతన్య యూత్ క్లబ్ సభ్యులు దుర్గ మాత దీక్ష చేపట్టారు,

కోవిడ్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

నెల్లూరు,అక్టోబర్17(ఆర్ఎన్ఎ): నెల్లూరు నగరంలోని ఆర్టీసి బస్టాండ్‌ని శనివారం ఉదయం కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు తనిఖీ చేశారు. ఆర్.టి.సి. బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు కోవిడ్ 19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి, బస్టాండ్ లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోవిడ్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కలెక్టర్ అన్‌లాక్ నిబంధనలు సడలించిన తర్వాత ఆర్.టి.సి బస్సుల ద్వారా జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు, ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. దీనివల్ల కరోనా వైరస్ అనుమానిత లక్షణాలు ఉన్నవారు, బస్సులలో ప్రయాణించే సమయంలో అనుమానం ఉంటే, వెంటనే నెల్లూరు ఆర్.టి.సి బస్టాండ్‌లోని ఈ కేంద్రంలో పరీక్ష చేయించుకోవచ్చన్నారు. దీనివల్ల కోవిడ్ వ్యాప్తి నగరాల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి నగరాలకు విస్తరించకుండా అడ్డుకోగలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ హరేంధర్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజ్యలక్ష్మి , ఆర్.టి.సి ఆర్.ఎం పి.వెంకటశేషయ్య, ఆర్.డి.ఓ హుస్సేన్ సాహెబ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com